క్లుప్తంగా

సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

శంషాబాద్ రూరల్: పెద్ద గోల్కొండకు చెందిన లబ్ధిదారుడికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ ఆదివారం అందజేశారు. గ్రామానికి చెందిన డి.సురేష్‌కు సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరైన రూ. 60 వేలకు సంబంధించిన చెక్కును పంపిణీ చేశారు. నార్సింగి మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎ.శ్రీకాంత్‌గౌడ్, శ్రీధర్‌గౌడ్, కుమార్‌యాదవ్, దేవేందర్, నజీర్, భిక్షపతి, సమీర్ తదితరులు పాల్గొన్నారు.

మహాసభలను విజయవంతం చేయాలి

శంషాబాద్: తెలంగాణ రాష్ట్ర భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలను ఏప్రిల్ 21, 22వ తేదీల్లో శంషాబాద్‌లో నిర్వహించనున్నట్లు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి ఆంజనేయులు తెలిపారు. స్థానికంగా ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. లేబర్ అడ్డాల దగ్గర మౌలిక వసతులను స్థానిక సంస్థలు కల్పించాలని డిమాండ్ చేశారు. శంషాబాద్ పట్టణంలో నిర్వహించే ఈ మహాసభలకు రాష్ట్ర వ్యాప్తంగా భవన నిర్మాణ కార్మికులు హాజరుకానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కె.రామస్వామి, దాసరి ప్రసాద్, మల్లేష్, మండల కార్యదర్శి నర్సగిరి తదితరులు పాల్గొన్నారు.

మెకానిక్ షెడ్డులో అగ్నిప్రమాదం



షెడ్డులో చెలరేగుతున్న మంటలు

మైలార్‌దేవ్‌పల్లి: కారు మెకానిక్ షెడ్డులో అగ్ని ప్రమాదం సంభవించింది. మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బుద్వేల్ రైల్వేస్టేషన్ సమీపంలోని వాహనాల మెకానిక్ షెడ్డులో ఆదివారం మంటలు చెలరేగాయి. దీంతో సంబంధీకులు మంటలను అదుపుచేసేందుకు చేసిన ప్రయత్నించిన ఫలితం ఇవ్వలేదు. ఈ సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేసుకొని ఫైర్ ఇంజన్ సాయంతో మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఎలాంటి ప్రాణ నష్టం కలుగలేదు. స్వల్పంగా ఆస్తినష్టం జరిగింది.


వేడుకగా పంచామృతాభిషేకం



పంచామృత అభిషేక పూజల్లో పాల్గొన్న భక్తులు

రాజేంద్రనగర్: చైతన్య విలాస్ కాలనీలోని శ్రీరామచంద్ర స్వామి ఆలయంలో ఆదివారం పంచామృత అభిషేక పూజలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమైన పూజా కార్యక్రమం మధ్యాహ్నం వరకు కొనసాగింది. తిరుమల తిరుపతి దేవస్థానానికి చెందిన వేద పండితులు పంచామృత అభిషేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. పరిసర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. దేవాలయ కమిటీ సభ్యులు భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా తగు ఏర్పాట్లు చేశారు.

పేద కుటుంబానికి కుట్టుమిషన్ అందజేత



రాయదుర్గం: పేద కుటుంబ జీవోనాపాధి కోసం కుట్టుమిషన్‌ను శ్రీకృష్ణ యూత్ అసోసియేషన్ ద్వారా ఆదివారం అందించారు. రాయదుర్గంలో నివాసముండే సురేష్, అరుణ దంపతులకు శ్రీకృష్ణయూత్ అధ్యక్షుడు అభిషేక్‌గౌడ్ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో పేదలకు చేయూత అందించేందుకు శ్రీకృష్ణ యూత్ ముందుంటుందన్నారు. ఇప్పటివరకు పది కుటుంబాలకు కుట్టుమిషన్లు అందించినట్లు పేర్కొన్నారు. యువతకు హెల్మెట్లు, మహిళలకు చీరలు, నిరుపేద కుటుంబానికి ఇంటి నిర్మాణానికి సహాయం అందించామని గుర్తు చేశారు. వినాయక్‌నగర్‌లో జీహెచ్ఎంసీ పార్కును అభివృద్ధి చేసినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో శ్రీకృష్ణయూత్ అసోసియేషన్ సభ్యులు సంగమేష్, దేవేందర్, సందీప్, ముర్తజా, విక్కీ, అమన్‌తోపాటు పలువురు పాల్గొన్నారు.

శంషాబాద్‌లో రహదారి

విస్త‘రణం’!

రహదారి 80 ఫీట్ల మేర విస్తరణపై వ్యతిరేకత

- వద్దే వద్దంటున్న స్థానికులు.. ప్రజాప్రతినిధులు
- ధర్మగిరి రోడ్డు నుంచి రైల్వేకమాన్ వరకు విస్తరణ
- 208 ఆస్తులకు నోటీసులు.. త్వరలో మరికొందరికి...
- నలభై ఫీట్లకే పరిమితం చేయాలని డిమాండ్
- మున్సిపల్ సమావేశంలోనూ తీర్మానం
- మాస్టర్ ప్లాన్ మేరకే విస్తరణ అంటున్న అధికారులు



80 ఫీట్ల మేర విస్తరించనున్న రహదారి ఇదే...

శంషాబాద్: ఆ రోడ్డు విస్తరణ వివాదాస్పదంగా మారుతోంది. స్థానికులు వద్దంటున్నారు.. ప్రజాప్రతినిధులు మద్దతిస్తున్నారు. ఏకంగా పురపాలక సంఘం సర్వసభ్య సమావేశంలో తీర్మానం కూడా చేశారు. అయినా అధికార యంత్రాంగం మాత్రం రహదారి విస్తరణకు నోటీసులు జారీ చేయడంపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తం అవుతోంది.

◆ శంషాబాద్ పట్టణంలోని ధర్మగిరి రోడు నుంచి రైల్వేగేటు వరకు రహదారిని ఎనభై ఫీట్ల మేర విస్తరించేందుకు అధికారులు నిర్ణయించారు. ఇందుకు భవనాల యజమానులకు నోటీసులు జారీ అవుతున్నాయి.

◆ ప్రధానంగా పట్టణంలోని 18, 19, 20వ వార్డులలో మొత్తం పెద్ద మొత్తంలో ఆస్తులు కోల్పోయే పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో స్థానికులతో పాటు ప్రజాప్రతినిధులు తీవ్రంగా వ్యతిరేకించారు. 80 ఫీట్ల రహదారి తమకు వద్దంటూ గట్టిగా నినదిస్తున్నారు.

భారీగా ఆస్తులు కోల్పోయే ప్రమాదం...

రహదారిని అధికారులు ప్రతిపాదించిన మేర 80 అడుగుల మేర విస్తరిస్తే ఆ ప్రాంతంలోని ప్రజలు భారీగా ఆస్తులను కోల్పోవాల్సి వస్తుంది.

◆ 18, 19, 20వ వార్డులలో వడ్డెరబస్తీ, కాపుగడ్డ యాదవ బస్తీ, రుద్రా కాలనీ, రైల్వే గేటు వరకు మొత్తం 208 మందికి సంబంధించిన ఆస్తులు రహదారి విస్తరణలో కోల్పోవాల్సి ఉంటుందని అధికారులు గుర్తించారు. ఈ మేరకు సంబంధిత వ్యక్తులకు వారం రోజులుగా నోటీసుల జారీ చేస్తున్నారు. దీంతో స్థానికులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

◆ ఎనభై ఫీట్ల మేరకు రహదారి విస్తరిస్తే కొన్ని కొందరు బాధితులు పూర్తి స్థాయిలో తమ ఇళ్లను కోల్పోతుండటంతో తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.

◆ స్థానిక ప్రజాప్రతినిధులు ప్రస్తుతం ఇరవై ఫీట్ల వెడల్పున్న ఈ రహదారిని నలభై ఫీట్ల మేరకు విస్తరిస్తే సరిపోతుందని అధికారులకు విన్నవిస్తున్నారు. అంతేకాకుండా ఇస్ బై ఇస్ దుకాణం పక్క నుంచి జాతీయ రహదారి అనుసంధానించే మరో ప్రణాళిక కూడా ప్రభుత్వం వద్ద ఉన్నా బస్తీల మీదుగా వెళ్లే రహదారిని విస్తరించాల్సిన అవసరం ఏముందని కూడా ప్రశ్నిస్తున్నారు. ప్రత్యామ్నాయ ప్రణాళిక అమలు లేదా విస్తరణను తగ్గించాలని వాదిస్తున్నారు.

కౌన్సిల్‌లోనూ తీర్మానం...

ఇటీవల జరిగిన శంషాబాద్ మున్సిపల్ సర్వసభ్య సమావేశంలో కూడా రహదారి విస్తరణ నలభై ఫీట్ల మేరకే చేపట్టాలని కౌన్సిలర్లు మున్సిపల్ కమిషనర్, చైర్ పర్సన్‌లకు వినతి పత్రాలను సమర్పించారు. ఈ మేరకు కౌన్సిల్‌లో కూడా తీర్మానం చేశారు. అవసరమైతే న్యాయ పోరాటం చేసేందుకూ సిద్ధంగా ఉన్నామంటూ స్థానికులు స్పష్టం చేస్తున్నారు.

అధికారుల దృష్టికి తీసుకెళ్లాం



ధర్మగిరి రోడ్డు నుంచి రైల్వేగేటు వరకు హెచ్ఆర్‌డీసీ చేపడుతున్న రహదారి విస్తరణను 80 ఫీట్ల నుంచి 40 ఫీట్లకు కుదించాలని ఇప్పటికే అధికారులకు వివరించాం. ఇటీవల కౌన్సిల్‌లో కూడా దీనిపై చర్చించాం. రైల్వే గేటు వద్ద ఫ్లై ఓవర్‌ను కూడా ఏర్పాట్లు చేయాల్సిన అవసరాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం.

– పి.సంజయ్‌యాదవ్, కౌన్సిలర్

మాస్టర్ ప్లాన్ మేరకే...

మాస్టర్ ప్లాన్ ప్రకారం 80 ఫీట్ల రహదారి విస్తరణ పనుల కోసం నోటీసులు జారీ ప్రక్రియను ప్రారంభించాం. విస్తరణలో కోల్పోయే.. ప్రభావం చూపే వాటిలో మొత్తం 208 ఆస్తులు ఉన్నాయి. ఇప్పటికే వంద మందికి పైగా నోటీసులను అందజేశాం. మిగతా వారికి కూడా త్వరలో పంపిణీ చేస్తాం.

– మనోహర్, టౌన్‌ప్లానింగ్ అధికారి, శంషాబాద్

నేడు ఆర్డీవో కార్యాలయంలో ‘ప్రజావాణి’

రాజేంద్రనగర్: అత్తాపూర్‌లోని రాజేంద్రనగర్ ఆర్డీవో కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించనున్నారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజావాణి నిర్వహిస్తామని అధికారులు తెలిపారు. ఆర్డీవో కార్యాలయ పరిధిలోని అన్ని ప్రాంతాల ప్రజలు తాము ఎదుర్కొంటున్న సమస్యలను ప్రజావాణిలో విన్నవించవచ్చన్నారు. వినతులు, ఫిర్యాదులు, ఇతరాత్ర అర్జీలు, దరఖాస్తులు స్వీకరించి సత్వర పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటామని వారు స్పష్టం చేశారు.

రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో...

రాజేంద్రనగర్: జీహెచ్ఎంసీ రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి నిర్వహించనున్నట్లు డీసీ రవికుమార్ తెలిపారు. అత్తాపూర్, రాజేంద్రనగర్, మైలార్‌దేవ్‌పల్లి, శాస్త్రీపురం, సులేమాన్‌నగర్ డివిజన్ల పరిధిలోని ప్రజలు తాము ఎదుర్కొంటున్న సమస్యలను ప్రజావాణి ద్వారా ఫిర్యాదు చేయాలని సూచించారు. జీహెచ్ఎంసీలోని అన్ని విభాగాల అధికారులు అందుబాటులో ఉంటారన్నారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజావాణి అందుబాటులో ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డీసీ కోరారు.

మార్కెట్ కమిటీ చైర్మన్‌కు సన్మానం





మల్లేష్‌ను సన్మానిస్తున్న అశోక్‌యాదవ్, వేణుగౌడ్, వట్టినాగులపల్లి ప్రజలు

మణికొండ: గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన గండిపేట మండల మాజీ ఎంపీపీ తలారి మల్లేష్ ముదిరాజ్‌ను పలువురు సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం కాంగ్రెస్ పార్టీ నార్సింగి మున్సిపాలిటీ అధ్యక్షుడు కె.అశోక్‌యాదవ్, నార్సింగి మార్కెట్ కమిటీ చైర్మన్ కె.వేణుగౌడ్, వట్టినాగులపల్లికి చెందిన డైరెక్టర్ ధర్మపురి ముదిరాజ్‌ల ఆధ్వర్యంలో సన్మానించారు. ఆయా ప్రాంతాల నాయకులు కుమ్మరి శేఖర్, బి.అరుణ్‌కుమార్, తారాసింగ్, చంద్రయ్య, బాలరాజ్, కిష్టయ్య యాదవ్, మల్లేష్, రాము, వినోద్‌కుమార్, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం మల్లేష్ ముదిరాజ్ టీపీసీసీ అధికార ప్రతినిధి ముంగిజైపాల్‌రెడ్డిని కలిశారు.

బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఆనందర్‌రావు



నూతన కమిటీ సభ్యులు

మణికొండ: మణికొండ బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఆనంద్‌రావు ఎన్నికయ్యారు. నూతనంగా ఏర్పాటు చేసిన అసోసియేషన్‌కు ఆదివారం మణికొండలో ఎన్నికలు నిర్వహించారు. అందులో కార్యనిర్వాహక అధ్యక్షుడిగా సీతారామరాజు, ఉపాధ్యక్షులుగా నరహరిశాస్త్రి, హరినాథ్‌రెడ్డి, కార్యదర్శిగా శ్రీనివాసరావు, కోశాధికారిగా దేవేందర్ రెడ్డి, ఉప కార్యదర్శులుగా రమేష్, దుర్గారావు, కార్యనిర్వాహక కార్యదర్శులుగా కోదండరామిరెడ్డి, రాజ్‌కుమార్, కార్యవర్గ సభ్యులుగా శ్రీనివాస్‌రావు, సంపత్, అప్పలరాజు, సయ్యద్ ఆసిం అహ్మద్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ... సంక్రాంతి పండగ తరువాత పెద్ద ఎత్తున బాల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తామన్నారు. లకాపూర్ కౌన్సిలర్ నవీన్‌కుమార్, బీఆర్ఎస్ నాయకుడు ఎ.లక్ష్మణ్‌రావు పాల్గొన్నారు.

ఆర్ఎంపీల సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న జైపాల్‌రెడ్డి

మణికొండ: రాష్ట్ర ఆర్ఎంపీ, పీఎంపీ, సీపీ అసోసియేషన్ 18వ వార్షికోత్సవ కేలండర్‌ను టీపీసీసీ అధికార ప్రతినిధి ముంగి జైపాల్‌రెడ్డి ఆవిష్కరించారు. నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని కోకాపేటలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆర్ఎంపీ, పీఎంపీ డాక్టర్ల సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తుందన్నారు. కలసి కట్టుగా సమస్యల పరిష్కారానికి సంఘం నాయకత్వం, సభ్యులు కృషి చేయాలన్నారు. నార్సింగి మున్సిపల్ వైస్ చైర్మన్ విజయ్‌బాబు, అసోసియేషన్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.వెంకట్‌రెడ్డి, నాయకులు జాఫర్, బాలకృష్ణారెడ్డి, రాజు, అనిల్, శివశంకర్, హరిబాబు, సంగమేశ్వర్, శివరాజు, లక్ష్మణ్, నరేందర్, సభ్యులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న మున్సిపల్ కార్మికుల ధర్నా

శంషాబాద్: ఎన్నికల్లో కాంగ్రెస్ పాలకులు ఇచ్చిన హామీలను నెరవేర్చాలంటూ సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు చేపట్టిన ధర్నా కొనసాగుతోంది. అందులో భాగంగా రెండో రోజు ధర్నా చేపట్టారు. అంబేడ్కర్ విగ్రహం వద్ద జరిగిన ధర్నాలో సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ... మున్సిపల్ కార్మికులకు కనీస వేతనాన్ని రూ. 26 వేల ప్రకారం చెల్లించాలన్నారు. ఉద్యోగ భద్రతతో పాటు రూ. 10 లక్షల బీమా కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లను తీర్చేందుకు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. ధర్నాలో కార్మిక సంఘం నాయకులు డి.నాగేష్, జయంధర్, ప్రవీణ్, యాదమ్మ, ఇంద్ర, సంపత్, సాగర్, సత్తయ్య, చంద్రయ్య, సుజాత తదితరులు పాల్గొన్నారు.

ఈవీవీ కాలనీ సంక్షేమ సంఘం కార్యవర్గం

మణికొండ: మున్సిపాలిటీ పరిధిలోని ఈవీవీ కాలనీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా రవికుమార్, ఉపాధ్యక్షుడిగా సతీష్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా వనపతి, కోశాధికారిగా సూర్యరాణి, సంయుక్త కార్యదర్శులుగా సుభాష్‌రెడ్డి, డాక్టర్ శైలజలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మాట్లాడుతూ... రాబోయే రెండేళ్లలో కాలనీ ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను కల్పిస్తామన్నారు. రోడ్లు, స్పీడ్ బ్రేకర్‌లు, దోమలు తదితర సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

శబరిమలైకు అయ్యప్ప స్వాములు



శబరిమలైకు వెళ్తున్న అయ్యప్పలు

రాజేంద్రనగర్: బుద్వేల్ గ్రామం అయ్యప్ప స్వామి నామస్మరణతో ఆదివారం మారుమోగింది. ఆదివారం అయ్యప్ప స్వామి ఆలయం వద్ద శ్రీశైలం గురుస్వామి ఆధ్వర్యంలో అయ్యప్ప మాలధారులకు ఇరుముడులు కట్టారు. ఇరుముడులను ధరించిన అయ్యప్ప స్వాములు శబరిమలైకు తరలివెళ్లారు. స్వాములు శివ చరణ్ గురుస్వామి, శ్రీకాంత్ స్వామి, దేవేందర్ స్వామి, మజ్జిగ నరేశ్ యాదవ్ స్వామి, హర్షిత్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో కిందపడి వ్యక్తి మృతి



మృతి చెందిన పాముల రఘు

మైలార్‌దేవ్‌పల్లి: మద్యం మత్తులో కింద పడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మైలార్ దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ సత్యకుమార్ సమాచారం మేరకు... రాజేంద్రనగర్ బుద్వేల్ ప్రాంతానికి చెందిన పాముల రఘు(50) రాజేంద్రనగర్ వెటర్నరీ కాలేజీలో సెక్యూరిటీ గార్డుగా పని నిర్వహిస్తున్నాడు. శనివారం రాత్రి కాటేదాన్ కల్లు కంపౌండ్‌లో కల్లు సేవించి కంపౌండ్ వాల్‌లో పక్కన కింద పడి మృతి చెంది ఉన్నాడు. ఉదయం పోలీసులకు సమాచారం అందడంతో ఘటన స్థలికి చేరుకున్న ఎస్ఐ సత్యకుమార్ ఆ మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

తప్పిపోయిన బాలుడిని కుటుంబ సభ్యులకు అప్పగింత



గౌలిపురా: ఇంటి ముందు ఆడుకుంటూ తప్పిపోయిన ఓ బాలుడిని భవానీనగర్ పోలీసులు ఆదివారం గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఇన్‌స్పెక్టర్ ఎం.బాలస్వామి తెలిపిన వివరాల ప్రకారం.. భవానీనగర్ స్టేషన్ ప్రాంతానికి చెందిన ఆర్షియా బేగం, మహ్మద్ ఫరీద్‌ల కుమారుడు మహ్మద్‌షాబెజ్ (4) ఆదివారం ఇంటి ముందు ఆడుకుంటూ కనిపించకుండా పోయాడు. కుటుంబ సభ్యులు స్థానిక ప్రాంతాల్లో వాకబు చేయగా ఎలాంటి ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు ఇన్‌స్పెక్టర్ బాలస్వామి తన సిబ్బందితో కలిసి స్టేషన్ పరిధిలోని సీసీ కెమెరాలను పరిశీలించి తప్పిపోయిన బాలుడిని గుర్తించారు. అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

అజ్మీర్ దర్గాలో చాదర్ సమర్పణ



గోల్కొండ: ఎమ్మెల్యే కౌసర్ తరపున మజ్లిస్ నాయకులు అజ్మీర్ దర్గాలో చాదర్ సమర్పించారు. ఎమ్మెల్యే ద్వారా ప్రత్యేకంగా ఒక బృందం ఆదివారం అజ్మీర్ దర్గాలో చాదర్ సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సమర్పించిన వారిలో మొహమ్మద్ అబ్బాస్ హుస్సేన్, ఫారుఖ్ హుస్సేన్ తదితరులు ఉన్నారు.

వైకుంఠ ఏకాదశి ఉత్సవాలకు ఏర్పాట్లు



- ముస్తాబవుతున్న చార్మినార్‌లోని వేంకటేశ్వర స్వామి ఆలయాలు
- ఈ నెల 10 నుంచి 14 వరకు ఉత్సవాలు

చార్మినార్: పాతబస్తీలోని వేంకటేశ్వర స్వామి ఆలయాలు వైకుంఠ ఏకాదశి ఉత్సవాలకు ముస్తాబవుతున్నాయి. ఈసారి జరిగే మహోత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. స్వామి వారి పల్లకీ ఊరేగింపు తదితర కార్యక్రమాలను కూడా పెద్ద ఎత్తున నిర్వహించడానికి కార్యాచరణను రూపొందించారు. ఇందులో భాగంగా పలువురు అధికార, అనధికార ప్రముఖులకు ఆహ్వాన పత్రాలను అందజేసి ఆహ్వానిస్తున్నారు. దక్షిణ మండలం డీసీపీ స్నేహా మెహ్రాను ఉత్సవాలకు హాజరు కావాలని కోరుతూ ఆలయ ప్రధాన అర్చకులు రమణాచార్యులు, ప్రతినిధి ప్యారసాని వెంకటేష్‌తో కలిసి ఆహ్వాన పత్రం అందజేశారు.

1961 నుంచి..

చార్మినార్ చౌక్ మైదాన్ ఖాన్‌లోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో 1961 నుంచి వైకుంఠ ఏకాదశి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈసారి ఉత్సవాలను వైభవంగా నిర్వహించడానికి ఆలయ ప్రధాన అర్చకులు శంగారం రమణాచార్యులు, అలంకార బ్రహ్మ ఆత్రేయాచార్యులు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. ఉత్సవాలను పురస్కరించుకుని ఇప్పటికే బ్రోచర్‌ను విడుదల చేశారు. ఉత్సవాల సందర్భంగా పశ్చిమబెంగాల్, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన పలువురు కళాకారులతో వివిధ రకాల పూలతో ఆలయాన్ని అందంగా ముస్తాబు చేయించడానికి సన్నాహాలు చేస్తున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

రాజేంద్రనగర్: విద్యుత్ సంబంధ మరమ్మతు పనుల కారణంగా సోమవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు చార్మినార్ సీబీడీ ఏడీఈ తెలిపారు. ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఈ కింది ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు. హైదర్‌గూడ, నలందనగర్, వెంకటేశ్వర ఎన్‌క్లేవ్, డాక్టర్స్ కాలనీ, సిరిమల్లెనగర్, లోటస్ స్కూల్, ప్లెజంట్ పార్కు, న్యూ ఫ్రెండ్స్ కాలనీ, లక్ష్మీనగర్, వాసుదేవి రెడ్డినగర్, సంజీవని హిల్స్, ఏజీ కాలనీ, ఈశ్వర్ థియేటర్, గాంధీ బొమ్మ, కాంటరెడ్డినగర్, రాధాకృష్ణనగర్, అంబియన్స్‌ఫోర్ట్, జనప్రియ అపార్ట్‌మెంట్, కేశవ్‌నగర్, కృష్ణానగర్‌లలో విద్యుత్ నిలిపివేస్తామన్నారు. అలాగే శివనగర్, మోర్ సూపర్ మార్కెట్, గుమ్మకొండ కాలనీ, సోమిరెడ్డి నగర్, నందనవనం, గోల్డెన్ ప్యాలెస్, అత్తాపూర్, వీకర్ సెక్షన్ కాలనీ, ఖాజానగర్, రాంబాగ్, తేజస్వినగర్ కాలనీ తదితర ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేస్తామని ఏఈ వివరించారు.

నార్సింగి మార్కెట్ సబ్‌స్టేషన్ పరిధిలో...

మణికొండ: నార్సింగి మార్కెట్ విద్యుత్ సబ్‌స్టేషన్ ఫీడర్ పరిధిలోని పలు కాలనీలలో సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని మణికొండ విద్యుత్ ఏఈ సంతోష్‌కుమార్ తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు బయూత్ కాలనీ, తిరుమలహిల్స్, ఖిద్రాకాలనీ, డాలర్స్ హిల్స్, అలకాపూర్ టౌన్‌షిప్ రోడ్డు నెంబర్ 13 నుంచి 30 వరకు, గంగోత్రి నక్షత్ర, గో గ్రీన్ కాలనీ, తుల్జారాం దేవాలయం వెనకవైపు, ఫ్లోరా గేటెడ్ కమ్యూనిటీ అపార్ట్‌మెంట్స్, హఫీజ్ కాలనీలలో విద్యుత్ ఉండదని ఆయన వివరించారు.

క్రీడా స్ఫూర్తిని పెంపొందించడమే లక్ష్యం

- ముగిసిన అంతర్ పాఠశాలల క్రీడాపోటీలు
- 8 రోజులపాటు కొనసాగిన క్రీడోత్సవాలు
- 11 స్పోర్ట్స్ ఈవెంట్లలో పాల్గొన్న 6 వేల మంది విద్యార్థులు



క్రీడోత్సవాల ముగింపు పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

అత్తాపూర్: రాజేంద్రనగర్ మండల పరిధిలోని ప్రతి ప్రైవేటు పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థినీ విద్యార్థులలో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించడంతో పాటు వారిలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించడమే తమ అసోసియేషన్ లక్ష్యమని రాజేంద్రనగర్ మండల ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల యజమాన్య సంఘం క్రీడల కార్యదర్శి బోయ లక్ష్మణ్ అన్నారు. అందుకు అసోసియేషన్ ఆధ్వర్యంలో 8 రోజుల పాటు నిర్వహించిన ప్రైవేటు పాఠశాలల అంతర క్రీడోత్సవాలు నిదర్శమన్నారు. ఆదివారం గురు నానక్ స్కూల్‌లో నిర్వహించిన కబడ్డీ మోనో యాక్షన్ పోటీతో రాజేంద్రనగర్ మండల ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల అంతర క్రీడల పోటీలు ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.ప్రభాకరాచారి, ప్రధాన కార్యదర్శి జి.శరవణ్ కుమార్, కోశాధికారి ఎస్.ఆర్.రజనీకాంత్‌లతో కలిసి బోయ లక్ష్మణ్ మాట్లాడుతూ... మండల పరిధిలోని ప్రైవేటు పాఠశాలలకు చెందిన సుమారు ఆరు వేల మంది విద్యార్థులు వివిధ పోటీల్లో పాల్గొన్నారన్నారు. ఫ్యాన్సీ డ్రెస్సు, డ్రాయింగ్, పెయింటింగ్, వ్యాసరచన, రన్నింగ్, క్యారమ్స్, చెస్, స్పెల్‌బీ, అథ్లెటిక్స్, షాట్‌పుట్ పోటీలతో పాటు చివరి రోజు కబడ్డీ, మోనో యాక్షన్ పోటీలతో కలిపి మొత్తం 11 స్పోర్ట్స్ ఈవెంట్లు విజయవంతంగా పూర్తి చేశామన్నారు. సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాలలో బాలురు, బాలికలు పోటాపోటీగా ఈ క్రీడల్లో తమ సత్తాచాటారని వివరించారు. ఉమ్మడిగా ప్రైవేటు పాఠశాలలు ఇంత పెద్ద ఎత్తున క్రీడలను నిర్వహించడం రంగారెడ్డి జిల్లాలోనే కాదు... రాష్ట్రంలో గతంలో ఎప్పుడూ జరగలేదని వారు పేర్కొన్నారు. విద్యార్థుల్లో క్రీడా చైతన్యం తీసుకొస్తే వారు మంచి క్రీడాకారులుగా రాణించినప్పుడు అది ఆ విద్యార్థి చదువుకున్న పాఠశాలకే కాదు.. ప్రాంతానికి, జిల్లాకు, రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకొస్తుందని తెలిపారు. రంగారెడ్డి జిల్లా ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల యాజమాన్య సంఘం అసోసియేట్ ప్రెసిడెంట్ ఎ.యాదగిరి, మండల సంఘం ప్రతినిధులు డాక్టర్ సంజీవ, ఎ.పి.చారి, కరుణాకర్, వాజిద్, పి.మనోహర్, సందీప్, శేషు, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



క్రీడా పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న దృశ్యం